# నగ్నసత్యం X

రచన:
శ్రీ. ఎం. వెంకట రెడ్డి.

'ఒరేయ్! ప్రక్కవీధి సుబ్బయ్య చనిపోయాడట' అన్న తండ్రికేక విన్పించి కుమార్ ప్రక్క మీది నుంచి దిగ్గున లేచాడు.

'ఎప్పుడు నాన్నా!' అన్నాడు ఆందోళనగా—

'రాత్రి 12 గంటలకి హఠాత్తుగా గుండె ఆగిపోయిందట'

అవార్త కుమార్‌కి కర్ణకఠోరమయింది. సుబ్బయ్య కుమార్తె రాధ, యికనుండి అనాధ, అని స్ఫురించే సరికి అతని కనుకొలకులలో నీళ్ళు నిండాయి,

'నాన్నా! రాధజీవితం!...'

అధోగతి అవ్వవలసిందేరా! చిల్లిగవ్వ కూడా ఉంచకుండా అంతా ఖర్చుపెట్టి, ఆఖరుకు రాధను దిక్కులేని దాన్నిచేసి చనిపోయాడు' అన్నాడు కుమార్ తండ్రి పరందామయ్య.

కుమార్ తప్పటడుగులు వేసుకుంటూ రాధ యింటికి వెళ్ళాడు. అప్పుడే సుబ్బయ్య శవాన్ని తీసుకొని వెళ్తున్నారు. రాధ భోరున ఏడుస్తుంది.

'రాధా' అన్నాడు మెల్లగా,

రాధ తలఎత్తి అతనివైపు చూసింది. కుమార్ కంటినుండి నీరు అప్రయత్నంగా కారుతున్నాయ్.

'విచారించకు! ఏంచేస్తాం?' అని ఆ వాతావరణంలో నిలువలేక అచ్చటినుండి బయటకు నడిచాడు.

ఆనాటినుండి కుమార్ రాధ యింటికి తరుచు వెళ్ళి ఆమె క్షేమ సమాచారములు తెలుసుకునేవాడు. అప్పుడప్పుడు ధనసహాయం కూడా చేస్తుండేవాడు.

కాని లోకం ఊరుకుంటుందా? వీరిరువురికీ చిలవలూ సలవలూ అల్లి నానారకాలుగా చెప్పుకుంటున్నారు ఆవూరి ప్రజ.

ఒక రోజున కుమార్ రాధ యింటికి వెళ్ళాడు. ఆమె బయటకు చూస్తూ ఏదో ఆలోచిస్తుంది.

'రాధా! అలా ఉన్నావే?' అన్నాడు.

'ఎలా ఉన్నాను?'

'ఏదో దిగులుగా ఉన్నట్లున్నావు. అవునా?'

'అవును. దిగులు పడక ఏమిచెయ్యమంటారు. లోకం మిమ్మల్నీ, నన్నూ కలిపి కోడైకూస్తుంది కాబట్టి...'

అది వినే నేనూ 'ఒక నిశ్చయానికి వచ్చాను' అన్నాడు కుమార్ ధృడంగా.

'ఏమిటది?' అంది రాధ నెమ్మదిగా.

'నిన్ను వివాహమాడి లోకం నోరు మూయాలని...'

రాధ అదిరిపడింది: 'మీరా!...నన్నా... వివాహము...' అంది ఆశ్చర్యంగా వణకుతున్న పెదములతో.

'అవును. నిన్నే'

'వద్దు. నేను మీకు తగను. రాధ తన స్వార్ధంకోసం ఒక శ్రీమంతుని కుమారుని

పలలో వేసుకుందనే అపనింద సహించలేను.'

'రాధా! నామాట కాదనకు. నిన్ను వివాహం చేసుకోవాలని ధృఢ నిశ్చయానికి వచ్చాను, నువ్వు తిరస్కరించకు' అన్నాడు కుమార్ ప్రాధేయపడుతూ.

కాని మీనాన్నగారు?

'అంగీకరించరనా నీభయం - పిచ్చి దానా - కన్న కొడుకు సుఖం ఏ తండ్రి కోరడు? తన కుమారుడు ఒకరికి మనసిచ్చి, మరొకరిని వివాహమాడి జీవితాంతం కుమిలి పోవాలని ఏతండ్రికుంటుంది? నీవు ఆ విషయమై చింతించకు, మానాన్నను ఒప్పించే భారం నాది అని అన్నాడు.

* * *

రాధ యింటినుండి హుషారుగా విజిల్ వేసుకుంటూ యింటికి తిరిగివచ్చిన కుమార్ కోపంతో ఎర్రగా కందిన తండ్రి ముఖం చూసి తక్కున ఆగిపోయాడు.

'యిప్పటివరకూ ఎక్కడికి వెళ్ళావ్?' అన్నాడు పరందామయ్య కుమార్‌కి దగ్గరగా వస్తూ—

'షికారుకు వెళ్ళాను నాన్నా!' అన్నాడు కుమార్.

కుమార్ చెంప ఛెల్లుమంది, 'వెధవా! తల్లిలేని నిన్ను పెంచి పెద్దచేసినందుకు యిదే నటరా నీవు చేసేపనీ _ రాధ యింటికి ఎందుకు వెళ్తున్నావ్? ఆమెతో నీ కేంపని అన్నాడు పరందామయ్య కోపంగా.

'..............'

'మాట్లాడవేం? చెప్పు'

'ఏమీ లేదు'

మరోసారి చెంప ఛెల్లుమంది. 'అబద్ధాలు కూడా నేర్చావా? యికనుంచి రాధ యింటి గుమ్మం త్రొక్కావంటే నే నూరుకోను. జాగ్రత్త!' అన్నాడు పరందామయ్య కోపంతో ఉడికి పోతూ.

ఎప్పుడూ కొట్టని, కనీసం తిట్టని తండ్రి ఆనాడు తనను కొట్టుటచే కుమార్ చాలా బాధపడ్డాడు. తండ్రిని అసహ్యంచుకున్నాడు. 'రాధకు ఏమిలోపం? ఆమెలో ఏమితక్కువ ఉందని నాన్న యిలా అన్నాడు. బీదది అనేగా?' అనుకున్నాడు. అతనిలో కోపం అధికమయింది. 'నాన్నా!' అన్నాడు బిగ్గరగా.

'ఏం?'

'నేను రాధను వివాహం చేసుకుంటాను' అని అచటినుండి వేగంగా మేడమీదికి వెళ్ళి పోయాడు. పరందామయ్య ఒకసారి తల పంకించి కండువా భుజంపై వేసుకొని ఎందుకో బయటకు వెళ్ళాడు.

* * *

మరునాడు కుమార్ మామూలుగా రాధ యింటికి వెళ్ళాడు. తలుపు జేరవేసిఉంది. తలుపుత్రోసి లోపల అడుగుపెట్టబోయి, ఖాళీగా ఉన్న యింటిని చూసి స్థంబించాడు. యిల్లంతా నిర్మానుష్యంగా ఉంది, సామానులు ఏమీ లేవు. పరిగెత్తుకొని వెళ్ళి ప్రక్క యింటివారిని రాధగురించి అడిగాడు.

పొరుగింటి పుల్లమ్మగారు, రాధ ఆరాత్రే ఊరు విడిచి వెళ్ళిపోయిందని చెప్పారు.

కుమార్ నిశ్చేష్టుడయ్యాడు. కాళ్ళు వణుకుతున్నాయ్. మాట తడబడుతుంది. 'రాధా' అని గట్టిగా అరచి కుప్పలా కూలిపోయాడు.

తిరిగి స్పృహవచ్చేసరికి తన యింటిలో ఉన్నాడు. రాధ, అంత హఠాత్తుగా ఊరు విడిచి వెళ్ళిపోవలసిన అవసరం ఏమికలిగిందో తెలియక విచారించాడు.

వారం రోజులు గడిచాయి. కాని రాధ పైగల మమతను చంపుకోలేక పోయాడు. యింతలో తన ఫ్రెండు మధు వద్దనుండి ఉత్తరం వచ్చింది. ఆత్రుతగా విప్పిచదివాడు. ఆ ఉత్తరంలో "కుమార్! నీవు తప్పకమా ఊరు ఒకసారి రావాలి. నీతో ముఖ్యమైన పని ఉంది, యిట్లు మధు." అని క్లుప్తంగా వ్రాసి ఉంది.

యింటివద్ద మనశ్శాంతిలేని తనకు మధు వద్దకు వెళ్ళిన కష్టములు మర్చిపోగలనేమో అనుకొని మధుకు, తను ఫలానా ట్రైనులో వస్తున్నాను, స్టేషన్ లో కలుసుకోమని టెలిగ్రాం యిచ్చి, ఆరోజే బయలు దేరాడు.

'కుమార్ బండి దిగగానే ఎంతో సేపు వెదకకుండానే మధు కన్పించాడు. 'ఏరా కుమార్! అలా చిక్కిపోయావ్?' అన్నాడు మధు.

'యీమధ్య ఒక విషాద సంఘటన జరిగిందిలే!'

'ఏమిటది?'

'కుమార్ తను రాధను ప్రేమించినట్లు, ఆమె వివాహానికి అంగీకరించి, ఆరోజే ఊరు విడిచి వెళ్ళిపోయినట్లు' చెప్పాడు.

'అన్నట్టు, నీకు వివాహం నిశ్చమయిందని విన్నాను - నిజమేనా?' అని అడిగాడు మధు.

'ఎవరికి? నాకా? వివాహమా? లేదు. నేను రాధను తప్ప మరెవ్వనీ ప్రేమించలేను. వివాహం చేసుకోను' అన్నాడు కుమార్ ధృడంగా

'అయితే నీకు వివాహం...'

'నిశ్చయం కాలేదు - కాలేదు'

'యిప్పుడంతా అర్థమయింది. అంతా తండ్రి పన్నిన పన్నాగ మన్నమాట'అన్నాడు మధు కోపంగా.

'నీవనే మాటలు నాకేమీ అర్థమవుట లేదు. మానాన్న ఏంచేసారు?'

పండిత డి.గోపాలాచార్యులవారి
జీవామృతం
ఆరోగ్యానికి బలానికి
Diamond Jubilee
1898 1958
ఆయుర్వేదాశ్రమం(ప్రైవేట్)లిమిటెడ్,
మదరాసు-17.

నీకు వివాహం నిశ్చమయిందని, నిన్ను రాధ చెడుదారి త్రొక్కుతుందని మీనాన్న రాధ దగ్గరికి వెళ్ళి అన్నాడట. రాధ తనేమీ నిన్ను పాడుచేయాలని చూడటంలేదు అంది. అప్పుడు మీనాన్న వూరు విడిచి వెళ్ళి పొమ్మని డబ్బు యిచ్చాడట. నీ శ్రేయస్సు కోరి రాధ ఆరాత్రి ఊరు విడిచి వచ్చేసింది. యిదే నగ్నసత్యం' అన్నాడు సీరియస్‌గా.

కుమార్ తెల్లబోయాడు. 'యిదంతా నీకెలా తెలుసు?' అన్నాడు అనుమానంగా.

'అది తర్వాత చెప్తాలే!' అంటుండగానే రిక్షా ఒక యింటి ముందు ఆగింది, అప్పుడే ఎవరో ఒక స్త్రీ 'అన్నయ్యా' అంటూ బయటకు వచ్చి మధు ప్రక్కనే ఉన్న కుమార్‌ని చూసి నిర్ఘాంతపోయింది.

'రాధా!' అంటూ ఆమె వద్దకు పరుగెత్తాడు.

కుమార్ రాధతో, 'తనకు వివాహం నిశ్చయంకాలేదని,అదంతా తన తండ్రిపన్నిన పన్నాగమని చెప్పాడు.

'రాధా! నువ్వు మధు వద్దకి ఎలా వచ్చావ్?' అన్నాడు కుమార్.

'నేను ఊరు విడిచి వచ్చిన పిమ్మట, ఒక రోజున మధుగారు కన్పించి, నా కథ అంతా తెలుసుకొని తన యింటికి తీసుకొనివచ్చి నన్ను తన సొంత చెల్లెలుగా ఆదరిస్తున్నారు.' అంది.

'రాధా! నువ్వు దూరమై పోయావని నేను ఎంత బాధ పడ్డానో తెలుసా?'

'తెలుసుకువోయ్! ముందు భోజనానికి లేవండి' అన్నాడు మధు అప్పుడే లోపలికి వస్తూ.

* *

కుమార్ రాధను తీసుకొని యింటికి తిరిగి వచ్చేసరికి తన యింటి ముందు జనం పోగయి ఉన్నారు. పాలేరు వెంకయ్యను 'ఏంజరిగింది?' అని అడిగాడు - కుమార్.

'పెదబాబుగోర్ని పాము...' అంటూ బోరున ఏడ్చాడు వెంకయ్య.

'నాన్నా!' అంటూ కుమార్ తండ్రివద్దకు పరుగెత్తాడు. రాధ కూడా అతనిని వెంబడించింది. పరంధామయ్య స్పృహలేకుండా మంచంమీద పడుకొని ఉన్నాడు.

కొంత సేపటికి పరంధామయ్య కళ్ళు తెరచాడు.

'కుమార్! వచ్చేవా బాబూ...చచ్చిపోయేముందు...నిన్ను చూడలేనేమో...అనుకున్నాను. అమ్మా ... రాధా ... నువ్వా వచ్చావా తల్లీ...మీ యిద్దరికి నేను చాలా అన్యాయం చేసాను...అందుకనే...పాము...కాటుకు...బలియై పోయాను...మీరిద్దరూ... పెండ్లి...చేసుకొని...సుఖంగా...వ...ర్ధి...ల్లం...డి' పరంధామయ్య నోటినుండి మాట రాలేదు. అతని నోరు శాశ్వతంగా మూసుకొంది. కుమార్ రాధ పరంధామయ్య శవంపై పడి భోరుమని దుఃఖించారు. దూరాన ఒక నక్షత్రం రాలింది.